క్లుప్తంగా

కొలతల సేకరణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రోడ్డును విస్తరించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. సింగిల్ రోడ్డును డివైడర్‌తో సహా 120 మీటర్ల డబుల్ రోడ్డుగా మార్చి రెండు వైపులా డ్రెయినేజీని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి బుధవారం కొలతల ప్రక్రియను రోడ్లు భవనాల శాఖ అధికారులు పూర్తి చేశారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

పట్టుబడితే కఠిన చర్యలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ.. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ.. డ్రంకన్ డ్రైవ్‌లో తనిఖీలలో పట్టుబడిన వారికి ట్రాఫిక్ స్టేషన్‌లో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడిపడం మూలంగా ఏదైన ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని గుర్తుంచుకోవాలని సూచించారు. పట్టుబడితే వాహనం సీజ్ చేయడంతో పాటు లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థికి చెక్కు అందజేత

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–4లో వెల్డర్‌గా పని చేస్తున్న గజ్జల రాజు కుమారుడు కిరణ్ కుమార్‌కు ఏరియా ఎస్‌ఓటూ జీఎం వీసం కృష్ణయ్య బుధవారం లక్ష రూపాయల నగదు చెక్కును అందజేశారు. కిరణ్ కుమార్ వారణాసి బనారస్ హిందూ యూనివర్సిటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న నేపథ్యంలో స్కాలర్‌షిప్‌గా సింగరేణి తరుపున అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, సీనియర్ పీఓ సింగు శ్రీనివాస్, టీబీజీకేఎస్ నాయకులు అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం

దమ్మపేట: మీసేవ నిర్వాహకులు, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, స్థానిక తహసీల్దార్ ముజాహీద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరిగిన ధరలు, కరెంట్ చార్జీల కారణంగా మీసేవ కేంద్రాలు నిర్వహించడం చాలా కష్టతరంగా మారిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి మీసేవ సర్వీసులపై కమీషన్ పెంచాలని కోరారు. మీసేవ జిల్లా వెల్ఫేర్ సెక్రటరీ బెల్లంకొండ రామారావు, ఉదయగిరి శివకోటేశ్వరరావు, అప్పన్న, మహేష్ పాల్గొన్నారు.

బీసీ సంఘం అధ్యక్షుడికి నివాళి

దమ్మపేట: గుండెపోటుతో మృతి చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిమళ్ళ వెంకటేశ్వరరావు భౌతిక కాయానికి, మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు బుధవారం నివాళులర్పించారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేర్వేరుగా పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను కలిసి అదుకుంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పొంగులేటి అనుచరుడు జారే ఆదినారాయణ కూడా ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, బత్తుల అంజి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి శివలింగాలు

అశ్వారావుపేటరూరల్: స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పుట్ట మన్ను, గోవు పేడకలు, ఆవు నెయ్యి, గోమూత్రం, గంగాజలం, ఆవు పాలతో కోటి పార్థివ శివలింగాలను తయారీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోజుకు వంద మంది మహిళలచేత ఈ పార్థివ శివలింగాలను స్వయంగా వారి చేతులతో తయారీ చేసే విధంగా ఏర్పాట్లు చేయగా బుధవారం సాయంత్రానికి 13,400 శివలింగాలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ బాధ్యులు శీమకుర్తి సుబ్బారావు మాట్లాడారు. కాగా, శివలింగాలను తయారీ చేసేందుకు మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి తరలి రావడంతో సందడి నెలకొంది.

అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: సీజనల్ వ్యాధుల విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని, అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ కంగాల భూలక్ష్మి సూచించారు. మండలంలోని కావడిగుండ్ల, పాత కావడిగుండ్ల గ్రామాల్లో బుధవారం గుమ్మడవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో విడత దోమల నివారణ మందు పిచికారీని ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని 279 గృహాలకు దోమల నివారణలో భాగంగా ఏసీఎం 5 శాతం మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, ఎంటీఎస్ విజయరెడ్డి, కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది వెంకటేశ్వర్లు, భాస్కర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీని మింగేస్తున్నారు..

- కొన్నిచోట్ల డమ్మీ కాగితాలపైనే బిల్లులు
- మరికొన్ని చోట్ల ఎమ్మార్పీకి మించి అమ్మకాలు
- జీఎస్టీ కట్టని మెజారిటీ వ్యాపారులు !


భద్రాచలంలో సాధారణ పేపర్‌పై బిల్లు రాస్తున్న నిర్వాహకుడు

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వానికి పన్నుల రూపంలో వెళ్లాల్సిన సొమ్మును కొంతమంది వ్యాపారులు మింగేస్తున్నారు. వినియోగదారులకు డమ్మీ కాగితాల్లో బిల్లులిచ్చి జీఎస్టీని ఎగ్గొడుతున్నారు. వేలాది షాపుల్లో ఇలాగే జరుగుతుండటంతో నెలనెలా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. షాపుల్లో జరుగుతున్న అక్రమ అమ్మకాలను పట్టించు కునే నాథుడే లేరు. కొన్ని స్టీల్ సామాన్ల షాపుల్లో ఏ వస్తువుపైనా ఎమ్మార్పీ ఉండదు. తూకం ఎంత ఉందో తెలియదు. షాపు యజమాని ఎంత చెబితే అంతకు కొనాల్సిన పరిస్థితి. దీంతో అటు వినియోగదారులు, ఇటు ప్రభుత్వమూ నష్టపోవాల్సి వస్తోంది.

జీఎస్టీ నంబర్లున్నా పన్నులేవి?

భద్రాచలం పట్టణంలో వందల్లో వ్యాపార సముదాయాలకు జీఎస్టీ నంబర్లు అధికారికంగా ఉన్నాయి. కానీ వీటిలో చాలా సముదాయాల నుంచి పన్నులు రావడం లేదు. ఉదాహరణకు భద్రాచలం పట్టణంలో పలు దుకాణాల్లో అడిగితే మాత్రమే బిల్లు ఇస్తారు. లేదంటే తెల్లకాగితంపై రాసిస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే సరుకు కూడా జీఎస్టీ లేకుండానే వస్తున్నట్లు తెలుస్తోంది. జీఎస్టీ బిల్లు అడగ్గా.. 18 శాతం ఎక్కువ చెల్లిస్తే ఆ బిల్లు ఇస్తానని యజమాని చెబుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పట్టణంలో నిర్వహించి వివిధ రకాల షాపులే కాదు, హోటళ్లు, ఫర్టిలైజర్ షాపులు, మొబైల్ షాపులు ఎక్కడా జీఎస్టీ కడుతున్న దాఖలాలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేపర్‌పై రాసిస్తున్నారు..

పట్టణంలో దుకాణాల్లో వస్తువులు, దుస్తులు కొనుగోలు చేసిన తరువాత తెల్లకాగిల పైనే బిల్లును రాసిస్తున్నారు. ఇదేంటి అని అడిగితే అప్పుడు వేరే విధంగా బిల్లును అందజేస్తున్నారు. ఇలా భద్రాచలంలోని చాలా దుకాణాల్లో జరుగుతోంది. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– సుమలతా రెడ్డి, రెవెన్యూ కాలనీ, భద్రాచలం

అధికారులు దృష్టి సారించాలి

వినియోగదారులను మోసం చేస్తూ వ్యాపారం చేస్తున్న వ్యాపారుల పై అధికారులు దృష్టి సారించాలి. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా విస్తృత తనిఖీలు నిర్వహించాలి. పట్టణంలో అధికారులు ఇలాంటి ఘటనలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– ప్రసాద్ రెడ్డి, భద్రాచలం

కేసీఆర్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యం


నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి సీఎం కేసీఆర్ ప్రభుత్వంతోనే సాధ్యమని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతో పాటు పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. పగిడేరు పంచాయతీ శాంతినగర్ నుంచి కొడిశలకుంట వరకు ఎస్‌డీఎఫ్ నిధులైన రూ.2కోట్లతో నూతనంగా చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, సాంబాయిగూడెం నుంచి పగిడేరు వరకు సుమారు రూ.4.57కోట్ల అంచనా వ్యయంతో చేపట్టబోయే బీటీ రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపనలు, రూ.10 లక్షలతో నిర్మించబోయే అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం మాట్లాడరు. ఈ సందర్భంగా పగిడేరులోని 50 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మరోవైపు ఇదే పంచాయతీలో మృతుల కుటుంబాలు, చికిత్స పొందుతున్న కుటుంబాల వారిని కలిసి పరామర్శించారు. ఇక, మణుగూరు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండెల్ మనీ బ్యాంక్‌ను ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ రేగా కాంతారావు బుధవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, బొలిశెట్టి నవీన్, రామిరెడ్డి, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, ఎం.కృష్ణ, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: బీఎస్పీ పార్టీ నాయకులను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. 'చలో సూర్యాపేట' నిరసన కార్యక్రమానికి తరలివెళ్తున్న అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మడకం ప్రసాద్ దొరతోపాటు మరో ఆరుగురు నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు. అనంతరం సొంతపూచికత్తుపై అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసినట్ల ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

బూర్గంపాడు: బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రమణను బుధవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమను పోలీసులు ముందస్తుగా నిర్బంధం చేయడం అప్రజాస్వామికమని అరెస్టైన నాయకులు అన్నారు.

అరెస్టులతో పోరాటాలను ఆపలేరు

భద్రాచలంటౌన్: శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు వెళ్తున్న బీఎస్పీ నాయకులను అరెస్ట్ చేయడం దారుణమని, అరెస్టలతో పోరాటాలను ఆపలేరని బీఎస్పీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాసం సిద్దార్థపూలే అన్నారు. బీఎస్పీ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సోడి వీరస్వామి, గాడిద దామోదర్, కృష్ణ, సాగర్, రాంబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తులకు చేయూత


గొర్రెలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ శ్రీలత

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే కుల వృత్తులకు చేయూతనందిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. మోరంపల్లిబంజరలో గొల్ల, కురమలకు రెండవ విడో గొర్రెలను బుధవారం ఆమె పంపిణీ చేశారు. ఆరుగురు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1.70 లక్షల విలువ కలిగిన గొర్రెలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి, ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, మండల పశువైద్యాధికారి డాక్టర్ రవీందర్, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మండల ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రహ్మణ్యం, గ్రామశాఖ అధ్యక్షులు కైపు ఖగేందర్ రెడ్డి, చేతుల పెద్ద వీర్రాజు, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సమావేశం

దమ్మపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ కీసర లక్ష్మి అధ్యక్షతన బుధవారం క్రీడా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మి మాట్లాడుతూ.. వచ్చే నెల 11 నుంచి 13వ తారీకు వరకు మండలంలోని పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి ఆటలపోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ క్రీడా పోటీలు జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో హెచ్ఎం వెంకటేశ్వరరావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

లష్కర్ల నియామకం

అశ్వాపురం: మండలంలోని కాకతీయుల కాలంనాటి తుమ్మలచెరువుకి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు బుధవారం ఇద్దరు లష్కర్లను నియమించారు. పినపాక మండలానికి చెందిన ఇద్దరు వీఆర్ఏలు బోడ వెంకటేశ్వర్లు, పంటగాని సర్వేశ్వరరావును లష్కర్లుగా నియమించారు. మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నోట్ పుస్తకాలు వితరణ

ములకలపల్లి: పొగళ్ళపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రాయల కేథారేశ్వర రావు విద్యార్థులకు పంపిణీ చేశారు. క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాదరావు, ట్రెజరర్ రంజాన్, సభ్యులు జగన్,హెచ్ఎం వసంత, గ్రామపెద్ద కొమ్మరాజు శ్రీను పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

చంద్రుగొండ: మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామంలో నిరుపేదలైన జ్వరపీడితులకు కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కోకన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఆయన వర్గీయులు నిత్యవసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. ఇటీవల జ్వరాలబారిన గ్రామస్తులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ, ఎంపీపీ పార్వతి, భోజ్యానాయక్, సాబీర్‌హుసేన్, దారావత్ రామారావు, సారేపల్లి శేఖర్, వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, సొసైటీ చైర్మెన్ చెవుల చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విమర్శిస్తే సహించం

కరకగూడెం: పేదల సంక్షేమం కోసం పోరాటాలు చేసే కాంగ్రెస్ పార్టీని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు పదేపదే విమర్శిస్తున్నాయని, దీనిని సహించేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఆయన మండలం కేంద్రంలోని ఆ పార్టీ కార్యలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు వర్తింపజేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి పథకం అమలు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పథకం అమలులో రాజకీయ జోక్యం లేకుండా అధికారులు పారదర్శకంగా విచారించి అర్హులైన ప్రతి పేదవారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బల్ల సాయికుమార్, మారెడ్డి శివాజీ, శోభన్‌బాబు, శ్రీరాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యార్థిని మృతి

కరకగూడెం: మండల కేంద్రానికి చెందిన ఓ పత్రిక రిపోర్టర్ కుమార్తె తిప్పని స్పందన(17) డెంగీతో బాధపడుతూ బుధవారం గుండెపోటు రావడంతో మృతి చెందింది. గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న స్పందన.. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం తీసుకుంది. బుధవారం మెరుగైన వైద్యం కోసం బాలిక తల్లిదండ్రులు ఆమెను భద్రాచలంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు డెంగీ జ్వరంగా నిర్ధారించారు. వైద్యం అందిస్తున్న క్రమంలో రక్త కణాలు తగ్గి గుండె నొప్పి రావడంతో బాలిక మృతి చెందింది. కాగా మృతురాలిని కొత్తగూడెంలోని కృష్ణవేణి కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది.అందరితో కలసి మెలసి ఉండే స్పందన అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. సారపాకకు చెందిన మహిళ స్కూటీపై కుమారుడితో కలిసి అశ్వాపురం నుంచి సారపాక వెళ్తుండగా మొండికుంట వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో రహదారిపై పెద్ద గుంత ఎదురైంది. ఈ నేపథ్యంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొని మహిళకు గాయాలయ్యాయి.

వ్యక్తి ఆత్మహత్య

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని తాతగుడి సెంటర్‌కు చెందిన అనూష లైటింగ్ అండ్ సౌండ్స్ యజమాని సంకా మల్లికార్జున్ ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం సాయంత్రం షాపులోనే ఆత్మహత్యకు చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై పోలీసులు వివరాలు ఆరా తీస్తున్నారు.

మానుగట్టలో వైద్యశిబిరం


మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ రేణుకారెడ్డి

దుమ్ముగూడెం: పర్ణశాల పీహెచ్‌సీ పరిధిలోని మానుగట్ట గ్రామంలో డాక్టర్ రేణుక రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. 48 మందిని పరీక్షించి మందులు అందజేశారు. యంటీలార్వా ఆపరేషన్ చేపట్టారు. హెచ్‌వి.అనసూర్య, ఏఎన్‌యం పార్వతి, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఆశ స్వరూప రాణి పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని తుంగారం గ్రామంలో రెండోరోజు చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ కనకం తనుజా ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటికీ తిరిగిన సిబ్బంది జ్వరపీడితుల నుండి రక్తనమూనాలను సేకరించారు.

ప్రజాసేవ చేసేందుకే రాజకీయం


మాట్లాడుతున్న జారె ఆదినారాయణ

ములకలపల్లి: ప్రజాసేవే పరమావధిగా రాజకీయాల్లోకి ప్రవేశించి, దిగ్విజయంగా ముందుకు సాగుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు జారె ఆదినారాయణ అన్నారు. ములకలపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేశానన్నారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, గాడి తిరుపతిరెడ్డి, జైరెడ్డి, కొమ్ము నాగరాజు, కోరంపల్లి చెన్నారావు, రాజేశ్, రాంబాబు, శ్రీను పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


కరాటే టోర్నమెంట్‌లో పతకాలు సాధించిన విద్యార్థినులు

మణుగూరురూరల్: ముంబాయిలోని ప్రియదర్శిని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 27వ తేదీన జరిగిన కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో మణుగూరు విద్యార్థినులు సత్తా చాటారు. అండర్–13, 14 విభాగాల్లో మండా పల్లవి, జక్కుల యామినిలు కటా, స్పారింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారు. ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా హాజరైన జపాన్ కరాటే గ్రాండ్ మాస్టర్ హన్సి కెవిన్ పునకోషి, సౌత్ ఆఫ్రికా గ్రాండ్ మాస్టర్ ఎరిక్ గోవెండర్, సినీ హీరో సుమన్ విద్యార్థులకు పతకాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో షుటో కాన్ జపాన్ కరాటే డూ ఇండియా హంబు సంస్థ మాస్టర్ రచ్చ శ్రీను బాబు, కరాటే మాస్టర్ కాశిమల్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించి.. గెలిపించండి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చినందుకు తనను గెలిపించి సీఎంకి బహుమతిగా పంపాలని డాక్టర్ తెల్లం వెంకట్రావు అభ్యర్థించారు. బుధవారం లక్ష్మీనగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తన పార్టీ గెలుపునకు పునాదులుగా పని చేస్తాయని అన్నారు. అందరి ఆశీర్వాదం కావాలని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, సర్పంచ్‌లు మట్టా వెంకటేశ్వర్లు, సోడే జ్యోతి, కారం జయ, నూపా సుమిత్ర, తెల్లం రామకృష్ణ, కాటిబోయిన వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేస్తున్న రెండో ఏఎన్ఎంలు

మణుగూరురూరల్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మణుగూరు తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌కు, క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు బుధవారం సెకండ్ ఏఎన్ఎంలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కేటాయిస్తున్న అన్ని రకాల పనులను ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి తమను పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఆర్.లక్ష్మీనారాయణ, సీపీఐ జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, మండల, పట్టణ కార్యదర్శులు మోహన్‌రావు, సుధాకర్, సోందె కుటుంబరావు, సెకండ్ ఏఎన్ఎంలు ఇందిర, సుమలత, పుష్పలత, సుజాత, రాధ, సంధ్య, పార్వతి, శాంతకుమారి, ఈశ్వరరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో 'రాఖీ'


దమ్మపేట: ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న సీడీపీఓ, అంగన్‌వాడీలు


దుమ్ముగూడెం: ఓ సూపర్ మార్కెట్ వద్ద మహిళల సందడి


ములకలపల్లి: రాఖీలతో శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులు

ములకలపల్లి: అన్నాచెల్లెళ్ల అనురాగానికి, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను మండలపరిధిలోని తిమ్మంపేట ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సోదరభావం వెల్లివిరిసేలా ఆనందోత్సాహాల నడుమ విద్యార్థినీ విద్యార్థులు ఒకరికిఒకరు రాఖీ కట్టుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ క్యాంపులో..

చర్ల: కలివేరులోని సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ పరిధిలోని పామేడు సీఆర్‌పీఎఫ్ క్యాంపులో బుధవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థినులను క్యాంపునకు పిలిపించుకున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్లు వారితో రాఖీలు కట్టించుకున్నారు. అనంతరం వారితో కలిసి తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ 151 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ ప్రదీప్ సింగ్ షెకావత్, అసిస్టెంట్ కమాండెంట్స్ కుంబ్లే అమూల్ విజయ్, తాపేస్ కుమార్, కోబ్రా 204 బెటాలియన్ సెకెండ్ ఇన్ కమాండెంట్ డీఎస్ కస్వా తదితరులు మాట్లాడారు. సీఆర్‌పీఎఫ్, కోబ్రా విభాగాలను చెందిన అధికారులు, జవాన్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన అంగన్‌వాడీలు

దమ్మపేట: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు, అశ్వారావుపేట అంగన్‌వాడీలు టీచర్లు రాఖీ కట్టారు. బుధవారం అశ్వారావుపేట మండలానికి చెందిన సీడీపీఓ రోజారాణి, అంగన్‌వాడీ టీచర్లు, మండలంలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే చేతికి రాఖీ కట్టి, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు ముందస్తుగా తెలియజేశారు. అనంతరం అంగన్‌వాడీలు సమావేశాలు నిర్వహించడానికి మీటింగ్ హాల్ మంజూరు చేయాలని కోరగా, సానుకూలంగా స్పందించారు.

దుకాణాల వద్ద సందడి

దుమ్ముగూడెం: లక్ష్మీనగరం గ్రామంలో రాఖీ పండుగ సమీపించిన నేపథ్యంలో దుకాణాల వద్ద సందడి నెలకొంది. తమ సోదరులకు రాఖీలు కొనుగోలు చేసేందుకు మండలంలోని మహిళలు, యువతులు దుకాణాలకు చేరుకున్నారు.